శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# డీసీఎంకి లోకేష్ అర్హుడే



**నెల్లూరు, జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం** డిప్యూటీ ముఖ్యమంత్రి పదవికి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌బాబు అన్ని విధాల అర్హులేనని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడయు, మాజీ మంత్రి, మాజీ శాసన మండలి సభ్యుడు, సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిఅన్నారు. నగరంలోని వేదయపాలెంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి వర్యులు నారా లోకేష్‌బాబును డిప్యూటీ సీఎం చేయాలన్న పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి ప్రతిపాదనను నేను ఆ విషయంలో ఎలాంటి ఆలోచనలు అనవసరమని సమర్ధవంతంగా నాయకత్వ లక్షణాలు ఉన్నాయని సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాటలకి మద్దతునిచ్చారు. ఆ పదవికి లోకేష్‌బాబు వంద శాతం అర్హులేనన్నారు. రాజకీయంగా అనేక డక్కా మొక్కిలు తిని, అవమానాలు ఎదుర్కొన్న తర్వాత యువగళం పాదయాత్రతో తనలోని నాయకత్వ లక్షణాలను నిరూపించుకున్నారని అది జగమెరిగిన సత్యమని, అందులో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. లోకేష్‌బాబు పోరాటపటిమను చూసి టీడీపీ కేడర్‌తో పాటు రాష్ట్ర ప్రజానీకం కూడా అండగా నిలిచి ఆయన నాయకత్వాన్ని జైకొట్టిందని ఆయనగుర్తు చేశారు. డిప్యూటీ సీఎం పదవికి అన్ని విధాల అర్హుడైన ఆయన పేరును డిప్యూటీ సీఎం పదవికి పరిశీలించాలని పార్టీని నేను కూడా కోరుతున్నానన్నారు.

# సోమశిల నీటిమట్టం



అనంతసాగరం,జనవరి19ప్రభాతవార్త: మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం సాయంత్రానికి1918 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 69.515టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి 650, పెన్నా డెల్టాకు 2650, కండలేరు వరద కాలువకు200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.419 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# సప్తసముద్రాల అవతల ఉన్నా లాక్కొస్తాం : మాజీ మంత్రి కాకాణి

## వైసిపి సానుభూతిపరులను ఇబ్బందిపెట్టిన వారిని గుడ్డలూడదీసి నిలబెడుతాం..!





**కావలి, జనవరి19 ప్రభాతవార్త:**వైసిపి సానుభూతిపరులను ఇబ్బందిపెట్టిన ప్రతిఒక్కరిని గుడ్డలూడదీసి నిలబెడతామని, సప్తసముద్రాల అవతల ఉన్నా లాక్కొస్తామని వైసిపి జిల్లా అద్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైసిపి సానుభూతిపరులు శ్రీనివాసులురెడ్డిని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డిప్రతాప్‌కుమార్‌రెడ్డిలు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. అధికారం ఎవ్వరికి శాశ్వతం కాదని హెచ్చరికలు చేశారు. ఈ రోజు మీరు, రేపు మేము తిరిగి చెల్లించడంలో మేముకూడా తగ్గేదిలేదని హెచ్చరించారు. బోగోలు మండలం కోళ్లదిన్నె గ్రామానికి చెందిన వైసిపి నాయకులపై, కార్యకర్తలపై దాడులు చేస్తారా.. అంటూ ఆయన ప్రశ్నించారు. అధికారం ఉంటే ఏమైనా చేస్తారా, ఇప్పటికే రాష్ట్రాన్ని రావణకాష్టం చేశారంటూ మాజీ మంత్రి కాకాణి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం వచ్చిన 6 నెలల్లోనే మీ బండారం బయటపడడంతో ప్రజల్లో ఇప్పటికే వ్యతిరేకత మొదలైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి వైసిపి కార్యకర్తలపై దాడులు చేయడం, అక్రమకేసులు పెట్టడంతప్ప రాష్ట్ర ప్రజలకు చేసిన పని ఒక్కటికూడా లేదంటూ కాకాణి మండిపడ్డారు. కోళ్లదిన్నెలో ఎప్పుడో జరిగిన గుడివివాదాన్ని మనసులో పెట్టుకుని ఈ రోజు అధికారం వచ్చాక ఒక్కడినే చూసి కాపుకాచి కొట్టడం ఒక మగతనమేనా.. అంటూ ధ్వజమెత్తారు. వైసిపి నాయకులను కోళ్లదిన్నెగ్రామంలో కొట్టింది మీరే అన్నారు. దెబ్బలుతిన్న బాధితుడికంటే ముందువచ్చి ఆసుపత్రిలో బెడ్డుమీద పడుకుంది టిడిపివారేనన్నారు. ఇదే ఆసుపత్రిలో అందరూ చూస్తుండగానే వైసిపి బాధితుడిపై మరలా దాడిచేసిందికూడా టిడిపివారేనన్నారు. బెడ్డు మీద ఉన్నవ్యక్తిలేచి దాడిచేశారన్నారు. అతను ఎలా బాధితుడవుతాడో చెప్పాలని గోవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. దాడిచేసిన టిడిపి నాయకులపై కేసులు లేకుండా, దెబ్బలుతిన్న వైసిపి బాధితులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. బాధితుడు శ్రీనివాసులురెడ్డికి అండగా ఉంటామన్నారు. ఏం భయపడవద్దన్నారు. అవసరమైతే మీ ఊరికి నేను, మీ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి ఇద్దరంకూడా కలిసివచ్చి నిలబడతామని కాకాణి భరోసా ఇచ్చారు. వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపినేతలు, కార్యకర్తలు జోలికివస్తే సహించేదిలేదని హెచ్చరించారు. నెల్లూరుజిల్లాలోనే కావలి నియోజకవర్గంలో టిడిపి అధికారంలోకి రాగానే వైసిపినేతలను, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇది మంచిపద్ధతి కాదన్నారు. చంద్రబాబునాయుడు అబద్ధాలుచెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. ప్రజలు ఇప్పుడిప్పుడే మోసపోయామని తెలుసుకుంటున్నారన్నారు. రానున్నది మళ్లీ వైసిపి ప్రభుత్వమేనని ప్రతాప్‌రెడ్డి తెలిపారు. దాడులు కొనసాగిస్తే సరైనరీతిలో బుద్ధిచెబుతామన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదన్నారు.

**-కావలి డీఎస్పీ శ్రీధర్‌ను కలిసి కాకాణి, ప్రతాప్‌రెడ్డి...** కావలి డీఎస్పీ పి.శ్రీధర్‌ను వైసిపి మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు కలిశారు. ఆయనతో చర్చలు జరిపారు. కావలిలో జరుగుతున్న అరాచకాన్ని ఆపాలంటూ వారు డిమాండ్‌చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడేందుకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని డీఎస్పీని కోరారు. ఈ నేతలవెంట వైసిపినేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

# తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకున్న వీబీఆర్



**నెల్లూరు, జనవరి 19, ప్రభాతవార్త- వైద్యం** వైకుంఠ ఏకాదశి చివరి రోజు సం దర్భంగా నారాయణ విద్యా సంస్థల జ నరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభా స్క ర్‌రెడ్డి తల్పగిరి రంగనాథస్వామివారిని ఆది వారం దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అర్చకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలతో పాటు ఆశీర్వ చనాలు అందజేశారు.శోభా యమానంగా జరిగిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనా థస్వామి ఉత్సవమూర్తుల పల్లకి సేవలో వేమిరెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మద్రాస విద్యార్థులకు బహుమతులు ప్రధానం



**బుచ్చి జనవరి 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని ఖాజానగర్‌లోని అల్ అమిన్ మద్రాస నాలుగో వ వార్షికోత్సవం ఇమామ్ అహమ్మద్ రజ ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆల్‌హజ్‌షేక్ భాషాసాహెబ్ సూరితో పాటు పలువురు ముస్లీం మత పెద్దలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మద్రాసలోని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. దాతల సహకారంతో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఖురాన్ అభ్యసించి పూర్తి చేసిన విద్యార్థులకు ఆల్‌హజ్‌షేక్‌భాషా సాహెబ్ నూరి సహకారంతో ఖురాన్ గ్రంధాన్ని విద్యార్థులకు బహుకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మసిదులో ఐదు పూటలా నమాజు చదివిస్తు యువతకు విద్యాబుద్ధులు నేర్పించడంలో ఇమామ్ అహ్మద్ రజా ఎంతో కృషి చేశారన్నారు. చిన్నారులకు ఉర్దూ పఠనం చేయించి ఐదు పూటల నమాజు చేసే విధంగా తీర్చి దిద్దడం జరుగుతుందని అన్నారు. ఇస్లాం సాంప్రదాయాలను చిన్నారులకు వివరించి మంచి మార్గంలో నడిపించేందుకు తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. చిన్నారులకు మద్రాసాలకు పంపించి ఖురాన్ పఠనం చేయించాలని సూచించారు. చిన్నారులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. విద్యాబుద్ధులు నేర్చుకున్న చిన్నారులు చెడు మార్గాలు అనుసరించకుండా దైవమార్గాల వైపు పయనిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఖాజానగర్ ముస్లీం సోదరులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సాయినాధుని సేవలో నుడా చైర్మన్ కోటంరెడ్డి దంపతులు



**నెల్లూరు,జనవరి19 ప్రభాతవార్త-విద్య** నగరంలోని స్థానిక బాలాజీనగర్‌లోని అద్దాల సాయిబాబా మందిరంలో ఆదివారం ఉదయం నూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆయన జన్మదినోత్సవం సందర్భంగా సతీసమేతంగా విచ్చేసి శ్రీ సాయి నాదునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతు తన జన్మదినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే , ప్రముఖ చిత్ర కధానాయకుడు నందమూరి బాలకృష్ణ తనకు ఫోన్‌ద్వారా శుబాకాంక్షలు చెప్పటం చాలా సంతోషంగా ఉందన్నారు. తన జన్మదినోత్సవం సందర్భంగా నగరంలోని అనేక ప్రాంతాల్లో, డివిజన్‌లలో అభిమానులు ,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. తనపై ప్రేమతో సేవా కార్యక్రమాలు చేపట్టిన వారందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆ సాయినాధుని ఆశీర్వాధంతో ప్రజలు అందరూ సుభిక్షంగా ఉండాలని ఆయన కోరారు. తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీమంత్రి కాకాణి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలకు సత్కారం



**కావలి, జనవరి19 ప్రభాతవార్త** వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఆదివారం వైసిపి జిల్లా అద్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలను వైసిపి నాయకులు, యువకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. పూలబొకే అందచేశారు. మాజీ మంత్రి కాకాణికి ప్రతాప్‌రెడ్డి స్వాగతంపలికి దుశ్శాలువాతో సత్కరించారు.

# యువతలో క్రీడాస్పూర్తి అవసరం



- భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా రాణించాలి
- నందమూరి బసవతారకం మెమోరియల్ కమిటీ సేవలు అభినందనీయం
- నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి

**ఇందుకూరుపేట, జనవరి 19, ప్రభాతవార్త** ప్రస్తుత తరుణంలో యువతలో క్రీడా స్పూర్తి అవసరమని, వారిలో క్రీడా స్పూర్తిని నింపేందుకు కృషి చేస్తున్న నందమూరి బసవతారకం కమిటీ నిర్వాహకులు అభినందనీయులని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నందమూరి బసవతారకం మెమోరియల్ కమిటీ, నారాయణరెడ్డిపేట వారి ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా విచ్చేసి బహుమతులు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ 38 ఏళ్లుగా నందమూరి బసవతారకం పేరుతో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. యువకులు ఉత్సాహంగా ఇటువంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా వారికి మానసిక ఉల్లాసంతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. నారాయణ విద్యా సంస్థల్లో సైతం ఈ ఏడాది నుంచి విద్యార్థులకు పలు క్రీడా పోటీల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. క్రీడా పోటీల కమిటీ వ్యవస్థాపకులు జాన గిరిబాబు మాట్లాడుతూ నందమూరి బసవతారకం పేరుతో గత 38 సంవత్సరాలుగా క్రికెట్ టోర్నమెంట్‌లను నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయి నుండి జిల్లా స్థాయి రాష్ట్ర స్థాయి నిర్వహించామని నేడు దక్షిణ భారతదేశ స్థాయిలో టోర్నమెంట్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. వివిధ రాష్ట్రాల నుండి క్రీడాకారులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనపరిచారని తెలిపారు. అనంతరం విన్నర్స్‌గా నిలిచిన ఏడో మైలుకు చెందిన ఎన్ఎస్ఆర్‌సీసీ జట్టుకు, అలాగే పున్నూరుకు చెందిన రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఒకటో డివిజన్ కార్పొరేటర్ జాన నాగరాజు బాలకృష్ణ, అసోసియేషన్ అధ్యక్షుడు మంచికంటి సుధాకర్, కమిటీ సభ్యులు మునగాల రంగారావు, కోవూరు మధు, రాజగోపాల్‌రెడ్డి, కిషోర్‌బాబు, కే.సుదర్శన్‌రెడ్డి, గంగాధర్,రాజగోపాల్‌రెడ్డి,గ్రామ పెద్దలు, క్రీడాకారులు తెలుగుదేశం పార్టీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళ



**వింజమూరు, జనవరి19,ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజక వర్గంలోని నిరుద్యోగయువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 50కంపెనీలతో ఐటి, మానిఫ్యాక్చరింగ్, టెక్ సపోర్ట్ , బిపిఒ, మార్కెటింగ్ వంటి వివిధ రంగాల్లో ఉద్యోగాల భర్తీకోసం మెగా జాబ్‌మేళాను ఫిబ్రవరి నెలలో నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు నిరుద్యోగ యువతీ యు వకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే యువతీ యువకులు సులువుగా విజయం సాధించేందుకు అవసరమైన కమ్యునికేషన్ స్కిల్స్,ఇంటర్వ్యూ పేసింగ్, టెకి న్క్స్‌పై 5రోజులపాటు శిక్షణాకార్యక్రమం వింజమూ రులోని టిడిపి కార్యాలయంలో నిర్వహిస్తారన్నారు. 10నుండి పిజి వరకు చదివిన వారు ఇందుకు అర్హులన్నారు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 18 సంవత్సరాల వయసుకు పైబడినవారందరూ అర్హులన్నారు. ఇతర వివరాలకు ఉదయం నుండి సాయంత్రం 7గంటల వరకు 798 9722341, 9701487419 నెంబర్లను సంప్రదించాలన్నారు. నియోజకవర్గంలోని యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# మారితేనే మీ బతుకులు బాగుపడతాయి



**కోవూరు జనవరి 19 ప్రభా త వార్త** : కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో అనుమానితులుగా, కేడీలుగా రికార్డుకెక్కిన వారు ఇకనైనా తమ తీరు మార్చుకుని సమాజంలో మంచిగా బతకాలని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ హెచ్చరించారు. కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వివిధ కారణాల మూలంగా ఇటువంటి ముద్ర పడిన వారు తమ తీరు మార్చుకుని సన్మార్గంలో ముందుకు సాగాలన్నారు. లేనిపక్షంలో అటువంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

# చిరంజీవిరెడ్డిని సత్కరించిన టిడిపినేత ఖాజామస్తాన్



**కలిగిరి, జనవరి19 ప్రభాతవార్త** కలిగిరిలో రాష్ట్రమాజీ పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, సీనియర్ టిడిపి నాయకులు మెట్టుకూరి చిరంజీవిరెడ్డిని కలిగిరిమండలం ఎరుకులరెడ్డిపాలెం టిడిపినేత, ప్రముఖ బిల్డర్ (చెన్నై) షేక్.ఖాజామస్తాన్, చెన్నై నగరపాలకసంస్థ 17వ వార్డు కౌన్సిలర్ ఆర్.జయశంకర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పూలబొకేను అందచేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర ,సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు. ఆర్ జయశంకర్‌ను షేక్.ఖాజామస్తాన్ చిరంజీవిరెడ్డికి పరిచయం చేయడం జరిగింది. అనంతరం త్వరలో ఎరుకులరెడ్డిపాలెంలో జరుగబోతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చిరంజీవిరెడ్డితో చర్చించడం జరిగింది.

# సంగంలో రౌడి షిటర్లకు కౌన్సిలింగ్



**సంగం జనవరి 19 ప్రభాతవార్త** సంగం పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలోని రౌడి షీటర్లకు ఆత్మకూరు డిఎస్పి వేణుగోపాల్,సిఐ వేమారెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడి షిటర్ల గత కేసుల వివరాలు,ప్రస్తుత ప్రవర్తన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రౌడి షీటర్లు వివాదాల జోలికి వెళ్ళకుండా మంచి ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు. సత్ప్రుతన కలిగిన రౌడి షీటర్ల షీట్‌లు తొలగిస్తామని అన్నారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతు సర్కిల్ పరిధిలో 101 మంది రౌడి షీటర్ల ఉన్నారని తెలిపారు.వారు మంచి ప్రవర్తన కలిగి ఉంటే షీట్లు తొలగిస్తామని అన్నారు. అలాగే రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మట్ ధరించాలని అన్నారు. సంగం, చేజర్ల,ఎఎస్‌పేట ఎస్ఐలు ఉన్నారు.

# ముగిసిన క్రికెట్ టోర్నమెంట్స్



**వింజమూరు, జనవరి19,ప్రభాతవార్త:** వింజమూరు గంగమిట్ట సమీపంలోని క్రీడా మైదానంలో ఈనెల 10వ తేదీ నుండి ప్రారంభమైన ఎంఎంసిఎల్ క్రికెట్ టోర్నమెంట్స్ ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపిటిసి సభ్యులు షేక్ తాటిచెట్ల కాలేషా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లాల కొండారెడ్డి, రిటైర్డ్ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ మాశిలామణి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. విజేతలుగా ఎంఎంసిఎల్ హోంటీమ్ ప్రథమస్థానం సాధించగా ఏఎస్‌పేట టీమ్ ద్వితీయ స్థానాన్ని సాధించింది. ఈసందర్భంగా అతిథులు మాట్లాడుతూ గడిచిన పదిరోజుల నుండి టోర్న మెంట్స్ నిర్వహించడం శ్రమతోకూడిన పని అయినప్పటికీ నిర్వాహకులు నిర్విరామంగా రెట్టింపు ఉత్సాహంతో టోర్నమెంట్స్‌ను నిర్వహించడం,ఈ టోర్నమెంట్స్‌లో 31టీమ్‌లు పాల్గొనడం , విన్నర్‌గా హోంటీమ్ నిలవడం అభినందనీయమన్నారు. గడిచిన 15సంవత్సరాల నుండి మొదటి బహుమతుని షేక్ తాటిచెట్ల కాలేషా అందించడం క్రీడాకారులను ప్రోత్సహించడమేనన్నారు. టోర్నమెంట్స్ వలన ఎంతోమంది క్రీడాకారులకు స్పూర్తినిస్తుందన్నారు. అనంతరం అతిథులకు ఎంఎంసిఎల్ నిర్వాహకులు అబ్దుల్‌కలాం శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.మొదటి బహుమతిని తాటిచెట్ల కాలేషా తన నిధులు 30,116రూపాయలను అందజేశారు. రెండవ బహుమతి ని పల్లాల కొండారెడ్డి, రేవనూరు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ మాశిలామణిలు , డాక్టర్ షఫీముల్లాలు 17,116రూపాయలు తమ సొంత నిధులను అందజేశారు. గంగమిట్ట యువత, ఎంఎంసిఎల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## గౌర నితాయ్ రథయాత్రను విజయవంతం చేయండి




**ముత్తుకూరు, జనవరి 19, ప్రభాతవార్త :** ఫిబ్రవరి 1వ తేది జరిగే 12వ గౌర నితాయ్ రథయాత్రను విజయవంతం చేయాలని నెల్లూరు ఇస్కాన్ అధ్యక్షులు శుకదేవ స్వామి ఆదేశాల మేరకు ఇస్కాన్ సభ్యులు మండలంలోని కృష్ణపట్నం, ముత్తుకూరు, బ్రహ్మదేవం తదితర గ్రామాల్లో ఇస్కాన్ బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ సభ్యులు మాట్లాడుతూ నెల్లూరులోని మూలాపేట అలంకార సెంటర్ 2 గంటల నుండి బారకాసు, పెద్ద బజారు, చిన్న బజారు, మునుముడి బస్టాండ్, సంతపేట, ఏసి బొమ్మ, గాంధి బొమ్మ, విఆర్‌సి మార్కెట్, ఆర్టీసి, ముగింపు, సర్వోదయ కళాశాలలో ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరు గౌర నితాయ్‌ను దర్శించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాగాల రాజశేఖర్, పసుపులేటి చంద్రశేఖర్, కృష్ణాపట్నం సుధీర్, శ్రీనివాస రావు, పసుపులేటి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడి-ప్రజాస్వామ్యంపై అవగాహనా సదస్సు

**ఆత్మకూరు, జనవరి19,ప్రభాతవార్త:** దేశ ప్రజల జీవన వ్యవస్థ పెట్టుబడుదారుల కబంధహస్తాల్లో ఉందని దీంతో దేశ ఆర్థిక జీవన వ్యవస్థ గాడి తప్పిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని నేతాజీ క్లబ్‌లో జరిగిన పెట్టుబడి-ప్రజాస్వామ్యం అనే అంశంపై సిపిఎం పట్టణ అధ్యక్షుడు కొప్పోలు డేవిడ్‌రాజ్ అధ్యక్షతన అవగాహనా సదస్సు ను నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాంభూపాల్ హాజరై ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా వ్యవస్థ గాడి తప్పిందని పెట్టుబడుదారులు దేశాన్ని శాసించే స్థితికి వచ్చారన్నారు. దీంతో దేశ ఆర్థిక పరిస్థితిపై కూడా వీరి ప్రభావం చూపుతుందని ప్రభుత్వాలు ఇప్పటికైనా మేల్కొని పెట్టుబడి వ్యవస్థపై దృష్టి సారించకపోతే దేశానికి పెను ప్రమాదం ఉందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కౌలురైతుల సంఘం నేత లక్ష్మీపతి, జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మూలి వెంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు అన్వర్‌బాషా, రైతు నాయకులు లక్కు ప్రసాద్, హజరత్తయ్య, వాగాల శ్రీహరి, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, సిఐటియు అనుబంధ సంఘాల సభ్యులు, యుటిఎఫ్ సభ్యులు , స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మర్రిపాడు పిహెచ్‌సిలో అరుదైన చికిత్స

**మర్రిపాడు, జనవరి19,ప్రభాతవార్త:** మండలంలోని మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం రాత్రి వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ అరుదైన చికిత్స చేశారు. మండలంలోని ఇర్లపాడుకు చెందిన ఓ మహిళకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు మర్రిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 108 సిబ్బంది ముందస్తు సమాచారంతో స్పందించిన వైద్యాధికారి గోపినాథ్ గర్భిణీకి సాధారణ కాన్పు అయ్యే విధంగా చికిత్స అందించారు. సాధారణకాన్పు అయిన ఆ మహిళకు 4.3 కేజీల శిశువు జన్మించిందని డాక్టర్ గోపినాథ్ తెలిపారు. సాధారణంకంటే అధిక బరువుతో పుట్టిన ఆ శిశువుతోపాటు తల్లి క్షేమంగాఉన్నట్లు ఆయన తెలిపారు. వైద్యాధికారి గోపినాథ్ ఆధ్వర్యంలో సాధారణ కాన్పులకు నిలయంగా మర్రిపాడు పిహెచ్‌సి నిలిచింది.



## క్రికెట్ విజేతలకు బహుమతులు పంపిణీ



**అనంతసాగరం, జనవరి19,ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల హిల్ కాలనీలోసంక్రాంతి సందర్భంగా నిర్వహించిన శ్రీ మల్లెంకొండేశ్వరస్వామి , అంకమ్మ తల్లి , పోలేరమ్మ తల్లి క్రికెట్ టోర్నమెంట్ ను మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య సహకారంతో టిడిపి నాయకులు ఏగు పెంచలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్స్ ఆదివారంతో ముగిశాయి. ఈసందర్భంగా గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మల్లెంకొండేశ్వరస్వామి సోమశిల మొదటి విజేతగా 20వేల రూపాయలు, వెంకటసాయి సోమశిల ద్వితీయ విజేతలుగా 10వేల రూపాయలు బహుమతులను మండల టిడిపి అధ్యక్షురాలు మునగపాటి సునీత సుబ్బరాజు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉత్తరకాలువ ఛైర్మెన్ ప్రసాద్‌నాయుడు, నాయకులు గూడూరు శ్రీకాంత్‌రెడ్డి, సాంబయ్య నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




**బిట్రగుంట జనవరి 19 ప్రభాతవార్త:** ఫిబ్రవరి 1,2,3తేది లలో నెల్లూరులో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తాళ్లూరు మాల్యాద్రి విజ్ఞప్తి చేశారు మండల సిపిఎం కార్యాలయంలో ఆదివారం సిపిఎం రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడప్రత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భ ంగాఆ యన మాట్లాడుతూ రాష్ట్ర మహాస భలకు కార్మిక, కర్షక, పేద,మధ్యతరగతి వర్గాలవారు తరలి రావలసిందిగా పిలుపునిచ్చారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలకు ఎండ కట్టేందుకు ఈ మహాసభల్లో తీర్మానాలు చేస్తారన్నారు. కావున ఈ సభలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కావలి డివిజన్ సభ్యులు గడ్డం మాల్యాద్రి, తుమ్మల వెంకయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చల్ల నరహరి తదితరులు పాల్గొన్నారు.

## జమున థియేటర్లో నాసిరక తిండి పదార్థాలు








**పొదలకూరు, జనవరి 19, ప్రభాతవార్త :** నాసిరకం ఆహార పదార్థాలు అమ్ముతూ.తినే తిను బండారాలలో కాలపరిమితి అయిపోయిన ఆహార పదార్థాలను నిల్వ ఉంచి..సినీ ప్రేక్షకులకు చుక్కలు చూపిస్తున్న వైనం పొదలకూరు జమున థియేటర్లో చోటు చేసుకుంటుంది. ఆదివారం థియేటర్లో సినిమా చూసేందుకు వెళ్లిన పలువురికి ఈ అనుభూతి ఎదురైంది. కాల పరిమితి అయిపోయిన కూల్ కేక్లు, ఉడికి, ఉడకని ఎగ్ పప్పులు ఇంత రద్దీగా ఉన్న సినిమా హాల్లో కూడా ప్రేక్షకులకు అమ్మడం..సినీ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసింది.వాటిని తిన్నవారు యాజమాన్య నిర్వాహకులను అడగడం, ఇందుకు నిర్వాహకులు సమాధానం చెబుతూ.బాగానే ఉన్నాయంటూ కితాబ్ ఇవ్వడం..అలవాటయింది. అధిక ధరలు వెచ్చించి థియేటర్లకు వచ్చిన ప్రజలు ఈ ఆహార పదార్థాలు తినడం వల్ల అటు డబ్బులుని నష్టపోతు.అనారోగ్యానికి గురిఅయ్యే పరిస్థితి కొని తెచ్చుకోవడం తప్పడం లేదు.చిన్న పిల్లలు తాగేందుకు తెచ్చుకున్న నీటిని కూడా థియేటర్ లోపలికి అనుమతించకపోవడం.. గమనార్హం. ఓ పక్క అధిక ధరలు, మరోపక్క నాసిరకం తినుబండారాలతో సగటు సినీ ప్రేక్షకుడు నిలుదోపిడికి గురివాల్సి వస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగ్నే సేఫ్టీ అధికారులు, జిల్లా ఉన్నంతజాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుకుంటున్నారు .

## చర్చి 62వ వార్షికోత్సవ వేడుకలు



**బిట్రగుంట జనవరి 19 ప్రభాతవార్త:** 62వ వార్షికోత్సవ వేడుకలు తెలుగు బాప్టిస్ట్ చర్చ్ భౌగోలు బిట్రగుంట మండలకేంద్రమైన బోగోలు లోని తెలుగుబాపిస్ట్ చర్చి 62వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథి గా కావలి పిపిబిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాస్టర్ జి డి దివాకర్ హాజరై ప్రసంగించారు.అనంతరం పేదలకు అన్నదానం వస్త్ర దానం చేసారు.ఈ కార్యక్రమంలో సంఘ కాపరి సామ్యూల్, సెక్రటరీ బంక ఫిలిప్, సంఘస్తులు పాల్గొన్నారు.

## పక్వానికి వచ్చిన పైరును నిలువున దున్నేశారు



**జలదంకి,జనవరి19,ప్రభాతవార్తః** తన పొలంలో పూతదశకు వచ్చిన పైరును రాత్రికి,రాత్రే నిలువునా దున్నించి నష్టపరచి తమకు తీరని అన్యాయం చేశారని మండల పరిధిలోని గట్టుపల్లి చింతలపాళెంకు చెందిన గొట్టిపాటి లక్ష్మి ఆదివారం లబోదిబోమంటుంది.బాదిత లక్ష్మి తెలిపిన వివరాలమేరకు గ్రామ సర్వే నంబర్986బై4లో 4,37సెంట్ల భూమి తమ పూర్వికులనుంచి సంక్రమించిందని వివరించింది.అయితే అదేగ్రామానికి చెందిన గొట్టిపాటి లోకేశ్వరరావు ఆయన కుమారుడు క్రిష్ట,మనుమడు నవీన్,అంబటి ప్రసాద్,మస్తాన్‌లు శనివారం అర్ధరాత్రి పొలంలోకి అక్రమంగ ప్రవేశించి ట్రాక్టర్‌తో పొలంలోని పైరును నాశనం చేశారని వాపోయింది.ఆపొలానికి సంబందించి సర్వహక్కులు మాకు వున్నప్పటికి వారు ఎందుకనో తమపై కక్షకట్టి గోడుమనిపిస్తున్నారని విచారం వ్యక్తంచేసింది.రోజు మాదిరె ఉదయం పొలంలోకి వెళ్ళి పరిశీలించానని దీంతో రాత్రికి,రాత్రే దున్నివేసిన వైనం కంటపడినవైనం తమను ఎంతగానో కలచివేసిందని పాపం బాధిత లక్ష్మి.బావురుమందిఈవిషయాన్ని గ్రామంలోని పెద్దలదృష్టికి తీసుకుపోయామని అంతేకాకుండ జలదంకి పోలీసులకు కూడ ఫిర్యాదు చేసి తమకు జరిగిన అన్యాయాన్ని గూర్చి వివరించామని తెలియజేసింది.తమపైరును నాశనంచేసి తమకు నష్టం చేకూర్చిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని న్యాయం చేయాలని ఈసందర్బంగ ఆమె వేడుకుంది.

## ఆదరణ కేంద్రంలో ముక్కు సుబ్బులయ్య కొండమ్మ వర్ధంతి




**బిట్రగుంట జనవరి 19 ప్రభాతవార్త:** బోగోలు మండలం భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో ఆదివారం కావలి మండలం సిరిపు రంకు చెందిన ముక్కు సుబ్బులయ్య, కొండమ్మ ల వర్ధంతి సందర్భంగా అనాధలకు బోజనం పండ్లు స్వీట్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆదరణ కేంద్రం డైరెక్టర్ సింహాద్రి రావు మాట్లా డుతూ ముక్కు వారి కుటుంబం తరుపున ప్రతి సంవత్సరం ఆదరణకేంద్రం లో అన్నదానం చేస్తున్నారని ముక్కు బ్రదర్స్ సేవలు ప్రశంసనీయం అన్నారు ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, సుబ్బులమ్మ, సుధాకర్, అమరావతి. తిరుమలరావు కుటుంబసభ్యులు,తదితరులు పోల్గొన్నారు.

## సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలి



**ఉదయగిరి, జనవరి 19, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలో రెండో సారి జరుగుతున్న సీపీఎం 27వ మహాసభలను ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య నాయబ్ వాల్ పోస్టర్లను వీధి వీధిన వాడవాడలో అంటించారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రాంతీయ కార్యదర్శి కోడెల రమణయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్టీసీ డిపో పంచాయతీ కార్యాలయం మెయిన్ బజార్ తహశీల్దార్ కార్యాలయం బస్టాండ్ సెంటర్ ఎంపీడీఓ కార్యాలయం తదితర ఆవరణ గోడలకు పలు వీధుల్లో బిజ్జింపల్లి గ్రామంలో వాల్ పోస్టర్లను అంటించారు. అనంతరం జిల్లాలో జరిగే 47 సంస్థల తర్వాత రెండోసారి జరుగుతుందని ఈ మహాసభకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు పాల్గొంటారని నియోజకవర్గంలో ఇంత వరకు పరిష్కారం కానీ ప్రధానమైన సమస్యలపై చర్చ జరిగి పరిష్కారంకు చేపట్టాల్సిన కార్యక్రమాలు రూపొందించి ఉద్యమాలకు సిద్ధమవుతున్నారు. కావున సీతారాంపురం ఉదయగిరి మండలాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాలు ఫిబ్రవరి 1,2,3 వ తేదీల్లో నెల్లూరులో జరుగుతాయన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## తీరప్రాంతంలో తాబేళ్లకాలేబరాల కలకం

**బిట్రగుంట జనవరి 19 ప్రభాతవార్త:** బోగోలు మండలం తాటిచెట్లపాలెం తీరంలో సముద్రపు తాబేళ్ల కళేబరాలు కలకలం రేపుతున్నాయి. సముద్ర పర్యావరణ నేస్తంగా పిలుచుకునే సముద్ర తాబేళ్లు మానవ తప్పిదంతో అకాల మృత్యువాత పడుతున్నాయి. పెరుగుతున్న జల కాలుష్యంతో సముద్ర జలాలు కూడా కాలుష్యకోరాల్లో చిక్కుకు న్నాయి. అయితే వాస్తవంగా సముద్ర జలంలోని కాలుష్యాని తగ్గించే జీవులు ఈ సముద్ర తాబేళ్లు. ఎందుకంటే సముద్రంలోని పాచి, మొక్కలు, వివిధ రకాల వ్యర్థ పదార్థాలను తింటూ సముద్రం నీరు కాలుష్యం కోరల నుంచి కాపాడుతాయి. తీరంలో గుడ్లు పెట్టేందుకు వస్తూ మృత్యువాత పడినట్టు అధికారులు అనుమానం వ్యక్తం చేశారు.



## డీసీఎంఎస్ మాజీ చైర్మన్‌ను సన్మానించిన అత్తిపల్లి



**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త :** కోవూరు మండలం వైసీపీ మండలాధ్యక్షులుగా ఎంపికైన అత్తిపల్లి అనూప్‌రెడ్డి మాజీ డీసీఎంఎస్ చైర్మన్ , జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, బొకేతో సన్మానించారు. తనకు పూర్తిస్థాయిలో సలహాలు, సూచనలు ఇచ్చి పార్టీ అభివృద్ధి కొరకు సూచనలు ఇవ్వాలని ఈ సందర్భంగా అనూప్‌రెడ్డి.. చలపతిరావును కోరారు. ఈ కార్యక్రమంలో కోవూరు సోషల్ మీడియా కన్వీనర్ శంకర్, కో కన్వీనర్ నవీన్, దేవిరెడ్డి సాయిరెడ్డి తదితరులు ఉన్నారు.

## విజయదీపికలు సిద్ధం

**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు జిల్లా పరిషత్ ద్వారా ఏర్పాటు చేసిన విజయదీపికలు ఆదివారం కోవూరు మండల ప్రాథమిక విద్యావనరుల కేంద్రానికి చేరుకున్నాయి. మొత్తం మండలంలో ఉన్న 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ వీటిని పంపిణీ చేసేలా సిద్ధం చేశారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ విజయదీపికల పంపిణీ జిల్లా పరిషత్ ద్వారా కొనసాగుతూనే ఉంది. ఈ విజయదీపికలను మంచి ప్రావీణ్యం కలిగిన అధ్యాపకుల సహకారంతో సిద్ధం చేశారు.

## నామకరణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



**కావలి, జనవరి19 ప్రభాతవార్త :** కావలి పట్టణానికి చెందిన పబ్బిశెట్టి వెంకటప్రియతమ్‌చంద్ర - నాగశిరీషల కుమారుని నామకరణోత్సవంలో వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని ఆశీర్వదించారు. ఆదివారం కావలి బృందావనం హౌసింగ్‌కాలని కళ్యాణమండపంలో జరిగిన ఈ నామకరణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి వైసిపినేతలతో తరలివెళ్లారు. ప్రియతమ్‌చంద్ర తండ్రి బంగారు కుదవవ్యాపారి పబ్బిశెట్టి చంద్రతో ప్రతాప్‌రెడ్డి కొద్దిసేపు ముచ్చటించారు.

# మంగమ్మని పరామర్శించిన అనురాధ

**నెల్లూరు, జనవరి 19, ప్రభాతవార్త-వైద్యం :** తెలుగుదేశం పార్టీ నాయకురాలు మంగమ్మకి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బాలాజీ నగర్‌లో ఉన్న ఆమె నివాసంలోనే విశ్రాంతి తీసుకుంటున్న మంగమ్మని, ఆదివారం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తాళ్లపాక అనురాధతో పాటు నెల్లూరు పార్లమెంటరీ మహిళా ప్రధాన కార్యదర్శి కోమారి విజయమ్మ, సీనియర్ నాయకులు సుశీలమ్మ, శ్రీదేవి, హేమలత, సుజనమ్మ, పరామర్శించి వారికి ఎల్లవేళలా తెలుగుదేశం పార్టీ నాయకులు అండగా ఉంటారని ధైర్యం చెప్పారు. పార్టీ ఎల్లవేళలా కార్యకర్తలకు ఆమె భరోసా కల్పించారు.



## బిచ్చగాడికి అంత్యక్రియలు నిర్వహించిన "యిలింద్ర"

**కావలి, జనవరి19 ప్రభాతవార్త :** కావలి పట్టణ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో శంకరయ్య అనే బిచ్చగాడు మృతిచెందారు. ఈ విషయం వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అభయం స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకులు యిలింద్ర వెంకటేశ్వర్లు (ఇవిఎస్)కు సమాచారమిచ్చారు. దీంతో అభయం స్వచ్ఛంద సేవాసంస్థ బాధ్యులు బిచ్చగాడు శంకరయ్యను గౌరవ మర్యాదలతో తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభయం స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకులు యిలింద్ర వెంకటేశ్వర్లు, అంబులెన్స్ డ్రైవర్ సునీల్, బాష, శ్రీనులు పాల్గొన్నారు. బిచ్చగాడికి గౌరవమర్యాదలతో అంత్యక్రియలు నిర్వహించిన అభయం సంస్థకు కావలిలో పలువురు అభినందనలు తెలిపారు.



## బుచ్చిలో ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలి



**బుచ్చి జనవరి 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలో దివంగత నేత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నంద మూరి తారకరామారావు విగ్రహం ఏర్పాటు చేయాలని తెలుగుదేశం నాయకులు,కార్యకర్తలు చెబుతు న్నారు .ఇది తెలుగుదేశం పార్టీ నాయకుల చిరకాలకోరిక అని టిడిపి నాయకులు తెలిపారు. ఈవిషయం టిడిపినాయకులు వింజం రామానాయుడు మాట్లాడుతు బుచ్చిరెడ్డి పాళెం నగర పాలక పంచాయితీలో ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటు విషయం కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళతామని అన్నారు. ముంబాయి రహదారిలో ఈవిగ్రహం ఏర్పాటు చేయాలని పలువురు టిడిపి నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముంబాయి రహదారిలో నారాయణ స్కూల్ సెంటర్‌లో ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమై_నప్పటికి ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని చెబుతున్నారు.

## ట్రాఫిక్, టచ్‌ఫోన్ దుర్వినియోగంపై సదస్సులు



**కావలి, జనవరి19 ప్రభాతవార్త** కావలి పట్టణంలోని నూతనంగా ఏర్పాటుచేసిన 'కలయిక' విజ్ఞానకేంద్రం త్వరలో ప్రారంభిస్తున్నట్లు కన్వీనర్లు జి.రాంప్రసాద్, యిలింద్రలావణ్య, సలహాదారులు చాకలికొండ శారదలు తెలిపారు. కావలి రామ్మూర్తిపేటలోని కలయిక కళ్యాణమండపంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడారు. కలయిక విజ్ఞానకేంద్రం ప్రారంభోత్సవం అయిన తర్వాత కావలిలో ట్రాఫిక్‌పైన, టచ్‌ఫోన్ దుర్వినియోగం, జీవితసమస్యలపై అవగాహన సదస్సులను ఏర్పాటుచేస్తామని తెలిపారు. తమ కార్యక్రమాల కార్యాచరణకు ప్రణాళిక తయారుచేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల తుమ్మలపెంట బీచ్‌లో వందలాది తాబేళ్ల మరణించడంపట్ల, వాటిని సంరక్షణ బాధ్యతలకు వివిధశాఖలను ఆదేశించి చర్యలు చేపట్టాలని ఈ నెల 20వతేది కావలి ఆర్డీఓను కలిసి గ్రీవెన్స్‌డేలో అర్జీలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎం.చంద్రశేఖర్, చన్నా వెంకట్రామయ్య, కె.హరినారపరెడ్డి, మాకినేని అరుణ, షేక్.ఫాతిమ, ఎస్‌కె.బుష్ర, నక్కా సాయిరాంప్రసాద్, ఎం.మాలకొండారెడ్డి, ఐ.మాధవరావు, ఇస్కా సాయి ప్రసాద్, బి.రమణమూర్తి, గాయకుడు ఎస్.రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో హెడ్‌మాస్టర్‌లకు సమావేశం




**ఉదయగిరి, జనవరి 19, ప్రభాతవార్త** మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెడ్‌మాస్టర్లకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉదయగిరిలోని స్త్రీ శక్తి భవన్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీవో 117 సంబంధించి హెచ్‌ంలతో స్కూల్ కాంప్లెక్స్ వారీగా సూచనలు సలహాలు అభిప్రాయాలు చర్చించనున్నట్లు తెలిపారు.

## నగరంలో ఘనంగా యోగివేమన నగరోత్సవం



**నెల్లూరు,జనవరి19 ప్రభాతవార్త-విద్య** యోగి వేమన జయంతిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రభోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటి ఆధ్వర్యంలో ఆదివారం యోగివేమన ప్రతిమ నగరోత్సవం(ఊరేగింపును) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా రెడ్ల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎన్.నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బివి.రెడ్డిలు పాల్గొని స్వామి ప్రతిమకు కర్పూర నీరాజనం సమర్పించారు. నగరంలోని స్థానిక అనిల్ గార్డెన్స్ నుండి ప్రారంభమైన ఈ ఊరేగింపు ముత్తుకూరుగేటు సెంటర్, మద్రాసుబస్టాండు సెంటర్, కేవిఆర్ పెట్రోల్ బంకు సెంటర్‌ల మీదుగా తిరిగి అనిల్ గార్డెన్స్‌కు చేరింది. యోగి వేమను అందరూ భక్తి శ్రద్దలతో కొలవాలని , ఆయన జ్ఞాన పద్యాలతో సన్మార్గంలో నడవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సురమురళి, పెంచల నరసయ్య, ఎంసీ సుధాకర్, రమాదేవి, కృష్ణ, సుమలత, రత్నమాచారి, నరసింహ ప్రసాద్, పద్మజ, నారాయణమ్మ , ప్రశీణ, కెవిరత్నం, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార జాత జయప్రదం చేయండి



**బుచ్చి జనవరి 19 ప్రభాతవార్త** ఈనెల 20 వ తేది నుండి 24 వ తేది వరకు నెల్లూరులో జరిగే సిపిఎం పార్టీ 27వ మహాసభలను జయప్రదం చేయాలని ,నెల్లూరు నుండి బయలు దేరుతున్న ప్రచార జాతను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున కోరారు.ఆదివారం భగత్‌సింగ్ కాలనీలో సిపిఎం పార్టీ 27వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు ఫిబ్రవరి 1,2,3 వ తేదిలలో నెల్లూరులో జరిగే సిపిఎం పార్టీ రాష్ట్ర మహా సభలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గోనాలని పిలుపునిచ్చారు. 3 వ తేది నెల్లూరు పట్టణంలో భారీ ప్రదర్శన బహిరంగ జరుగుతుందని ఈ సభకు రాష్ట్ర జాతీయ నాయకులు పాల్గోంటారని తెలిపారు. సోమవారం జాతకు ఆర్టీసి బస్టాండ్ వద్ద స్వాగతం పలకాలని ఆయన కోరారు. ఈప్రచార జాతకు స్వాగతం పలికేందుకు మండలంలోని సిఐటియు,సిపిఎం పార్టీ కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, ఆవాజ్‌షేక్ జానీభాషా, నాయకులు దత్త శ్రీకోటయ్య, డివైఎఫ్ఐ నాయకులు కొమ్మి శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## ప్రధానమంత్రి "మన్‌కీబాత్"ను వీక్షించిన బిజెపినేతలు



**కావలి, జనవరి19 ప్రభాతవార్త** బిజెపి కావలి పట్టణశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోడి "మన్‌కీబాత్" కార్యక్రమాన్ని పట్టణంలోని పలుప్రాంతాల్లో బిజెపినేతలు, కార్యకర్తలు వీక్షించారు. ప్రధానమంత్రి మాట్లాడిన విషయాలను ప్రస్తావించారు. మహాకుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని మన్‌కీబాత్‌లో ప్రధాని చెప్పిన విషయాలు తెలిపారు. పేదలు, ధనవంతులు అందరూ మహాకుంబమేళాలో ఏకమవుతున్నారని, చారిత్రాత్మకమైన, మతపరమైన కార్యక్రమాల్లో యువత పెద్దసంఖ్యలో పాల్గొనడం అభినందనీయమని, ఆ సంస్కృతి, సాంప్రదాయాలు పాటించాలని ప్రధాని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి 1వ పట్టణ అధ్యక్షుడు మందా కిరణ్‌కుమార్, జిల్లా టెలికాం అడ్వైజరి కమిటీసభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం, మట్ట మల్లికార్జునరావు, అరవింద్, కార్తీక్, శ్యాంసుధీర్, పాల్గొన్నారు.

## ప్రాంగణాన్ని శుభ్రం చేసిన కోవూరు పోలీసులు



**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కోవూరు పోలీస్‌స్టేషన్ పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి సూచనల మేరకు ఎస్సైలు, ఏఎస్సైలు, పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రభుత్వం ప్రతి నెలలోని మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రం చేయాలని ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఆదివారం సైతం కోవూరు పోలీసులు ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం విశేషం.

## కానరాని గాంధీ పార్కు




కోవూరు జనవరి 19 ప్రభాతవార్త : స్వాతంత్ర్య సమపార్జనకు తమవంతుగా శాంతియుత వాతావరణంలో కృషి చేసిన మహనీయుడు మహాత్మా గాంధీజీ పార్కును గతంలో స్వాతంత్ర్య సమరయోధులు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో పలువురు ప్రత్యేకంగా చొరవ తీసుకుని స్థానిక శివాలయం ఎదుట స్థలంలో ఈ గాంధీ పార్కును ఏర్పాటు చేసి అందులో మహాత్ముని విగ్రహం కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. గతంలో ఈ పార్కుకు ఉన్న గోడలో ప్రత్యేకంగా అప్పటి స్వాతంత్ర్య గోడ పత్రికలను కూడా ఏర్పాటు చేశారు. ఇందులో అప్పటి స్వాతంత్ర్యానికి సంబంధించిన పలు విషయాలను ఈ గోడ పత్రికలో రాసేవారు. దీనికి తోడు ఈ పార్కులో లోకేసింగ్ అనే దాత ఒక ప్రత్యేకమైన రేడియో రూమ్ ఏర్పాటు చేశారు. ఈ రేడియో ద్వారా అప్పట్లో ప్రజలు వార్తలు వినేవారు. కాలక్రమేనా ఇవన్నీ మరుగున పడిపోయాయి. ప్రతి సంవత్సరం జనవరి 26, ఆగస్టు 15, అక్టోబర్ 2, జనవరి 31 తేదీల్లో మాత్రమే ఈ గాంధీ పార్కులో ఉన్న మహాత్ముని విగ్రహానికి పూలమాల వేస్తారే తప్ప మిగతా సమయంలో ఎవరూ కూడా ఈ పార్కు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం ఈ పార్కు ముందు ఆటోలు, టెంపోల స్థావరంగా ఏర్పాటైంది. దీనికి తోడు పార్కు ముందర ప్రాంతంలో ప్లెక్సీలు ఏర్పాటు చేయడంతో దారిన పోయే వారికి ఈ ప్రాంతంలో పార్కు కూడా ఉందనే విషయం మరిచిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి ఈ గాంధీ పార్కుకు పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేయాలని పలువురు సీనియర్ నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ పార్కు ముందర ప్రాంతం అంతా ఆటో స్టాండ్‌గా ఏర్పడి పోవడంతో అసలు మహాత్ముని విగ్రహమే కానరాని పరిస్థితి ఏర్పడింది. దీనిపై తక్షణమే అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

## రాష్ట్ర ఆర్చరీ పోటీలకు జిల్లా జట్ల ఎంపికలు



**నెల్లూరు,జనవరి19 ప్రభాతవార్త-విద్య** ఈనెల 23 నుండి విజయవాడలో నిర్వహించనున్న 44వ ఎన్‌టిపిసి రాష్ట్ర ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికలను ఆదివారం నగరంలోని స్థానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడాప్రాంగణంలో జల్లా అర్చరీ అసోసియేసన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష్య కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష,పావురాల వేణులు మాట్లాడుతు ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో వెంకట లోకేష్, సాత్విక్, ప్రసన్నకుమార్ యాదవ్,కార్తికేయన్, మహిధర్, మరిశ్రీకర్, బాలికల విభాగంలో దీత్యా చండిక, లాస్య, ఆవియా, మాన్విత, మోక్షారెడ్డి, క్రితికో కిరణలు ఎంపికైయ్యారన్నారు. రికర్వ్ రౌండ్‌లో బాలుర విభాగంలో సాయి మౌర్య, తరునీష్‌జ్యోత్స, రాజేష్, జిగే న్ష్, బాలికల విభాగంలో డెలీషా, నిష్విత, లక్ష్మీభావాగ్ని లు ఎంపికైయ్యాని తెలిపారు. కాంఫౌండ్ రౌండ్‌లో బాలుర విభాగంలో వరుణ్‌రెడ్డి, రమేష్‌రకుమార్, వికాస్, ఆశ్రిత్, బాలికల విభాగంలో యశశ్విని, జననీరెడ్డి, గాయత్రి లు ఎంపికైయ్యారన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజయకేతనం ఎగురవేయ్యాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంకినపల్లి కి సతీ వియోగం



**వింజమూరు,జనవరి19,ప్రభాతవార్త**: ఎఫ్‌సిఐ మాజీ డైరెక్టర్ , టిడిపి సీనియర్ నాయకులు అంకినపల్లి ఓబులురెడ్డి సతీమణి అంకినపల్లి కౌశల్యమ్మ(70) శని వారం రాత్రి మృతిచెందారు. ఆమె అంత్యక్రియలను ఆదివారం మండలంలోని గుండెమడకలలో నిర్వహించారు. కౌశల్యమ్మకు నివాళులర్పించేందుకు నియో జకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వివిధపార్టీ నేతలు, ప్రముఖులు గుండెమడకలకు చేరుకొని ఓబులురెడ్డిని, ఆయన తనయుడు శివశంకర్‌రెడ్డిని పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ,ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాగుంట శ్రీనివాసులురెడ్డి



ఫోన్ ద్వారా తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నెల్లూరుపట్టణంలోని వివిధ ప్రాంతాల కార్పోరేటర్లు , వివిధరంగాల్లోని ప్రముఖులు కౌశల్యమ్మకు నివాళులర్పించారు. మండలంలోని టిడిపి, వైసిపి ముఖ్య నేతలు అంతిమ యాత్రలో పాల్గొని ఘన నివాళులర్పించారు. కౌశల్యమ్మకు కుమారుడు శివశంకర్‌రెడ్డి, కుమార్తె హిమబిందు ఉన్నారు.

## నుడా చైర్మన్ పేరు మీద ప్రత్యేక పూజలు



**నెల్లూరు, జనవరి 19, ప్రభాతవార్త -వైద్యం** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, నెల్లూరు అర్బన్ డవలప్‌మెంట్ అధారిటి చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం నగరంలోని బాలాజీ నగర్ లోని వరసిద్ది వినాయక స్వామి మందిరంలో టీడీపీ నేతలు వినుకుల సుధాకర్ శ్రీనివాసులురెడ్డి పేరు మీద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 13వ డివిజన్ అధ్యక్షుడు తానే మస్తాన్ ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజకీయాల్లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దేవుని ప్రార్ధించారు. ఈ పూజా కార్యక్రమాల్లో శ్రీనివాస నాయుడు, ఇనుకుల సుధాకర్‌బాబు(సుధా), ఎంపీ శ్రీనివాసులు, అఖిల్, నరేంద్ర, చందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గెజిటెడ్ అధ్యాపక సంఘం అధ్యక్షుడుగా డాక్టర్ రామ్ ప్రసాద్



**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త** : ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం నెల్లూరు జిల్లా యూనిట్ ఎన్నికలు ఆదివారం ప్రభుత్వ మహిళా కళాశాల డీకేలో జరిగాయి. ఈ సంఘం జిల్లా అధ్యక్షులుగా కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ కె. రామ్‌ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో కార్యదర్శిగా కందుకూరు డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ రాజగోపాల్‌బాబు, జిల్లా యూనిట్ ఉపాధ్యక్షులుగా డీకే ప్రభుత్వ మహిళా కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వి. చెంచురామయ్య, కోశాధికారిగా జంతు శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ రజని, జిల్లా యూనిట్ కార్యదర్శిగా విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకులు కె. రవిచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా విడవలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ వి. శివరామమూర్తి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంపికైన జిల్లా కమిటీ నేతలు మాట్లాడుతూ అధ్యాపకులకు సంబంధించిన వివిధ సమస్యలను తమ స్థాయిలో అంకితభావంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎంపికైన సభ్యులను అధ్యాపకులు , కళాశాల ప్రిన్సిపాల్స్ ప్రత్యేకంగా అభినందించారు.

## పెట్రోల్ బంక్ అధినేతకు మాతృమూర్తి వియోగం



**కోవూరు జనవరి 19 ప్రభాతవార్త** : కోవూరులో ఉన్న పెట్రోల్ బంక్ అధినేత పచ్చిపాల శ్రీనివాసులురెడ్డి మాతృమూర్తి సుగుణమ్మ మృతిచెందారు. వీరి అంత్యక్రియలకు పార్టీలకతీతంగా అన్ని పార్టీల నాయకులు సందర్శించి తమ నివాళులర్పించారు. పచ్చిపాల శ్రీనివాసులురెడ్డి పెట్రోల్ బంక్ అధినేతతో పాటు సీపీఎం సానుభూతిపరుడుగా ఉంటూ ఎన్నో కార్యక్రమాల్లో తమవంతుగా భాగం పంచుకున్నారు. ఆదివారం జరిగిన సుగుణమ్మ అంత్యక్రియలకు పెద్ద ఎత్తున బంధువులు, స్నేహితులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## బంగారంతో ఉడాయింపు

**నెల్లూరు క్రైమ్ జనవరి 19 ప్రభాతవార్త:** ఒక వ్యాపారి వద్ద నమ్మకంగా పనిచేస్తూ అవకాశం దొరకగానే బంగారంతో ఉడాయించాడో ప్రబుద్ధుడు. స్థానిక తిప్పరాజు వారి వీధికి చెందిన పవన్ కుమార్ జైన్ బంగారం వ్యాపారి కొత్తూరు టైలర్స్ కాలనీకి చెందిన ఇంతియాజ్ పవన్ కుమార్ వద్ద బంగారం కడ్డీలు తీసుకుని ఆభరణాలు తయారుచేసి ఇస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల రెండవ తేదీ పవన్ కుమార్ ఆభరణాలు తయారుచేసి ఇచ్చేందుకు 550 గ్రాముల బంగారంను ఇంతియాజ్ కు అందించాడు. ఈ బంగారం తీసుకుని ఇంతియాజ్ పరారయ్యాడు. దీంతో పవన్ కుమార్ చిన్న బజార్ పోలీసులను ఆశ్రయించగా వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఎంపీడీఓ కార్యాలయంలో మహాయోగి వేమన జయంతి వేడుకలు




**ఉదయగిరి, జనవరి 19, ప్రభాతవార్త :** ఎంపీడీఓ కార్యాలయంలో మహాయోగి వేమన జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వేమన ప్రజా కవి, సంఘసంస్కర్త విశ్వధాభిరామ వినరవేమ అనే మకుటముతో వేమన రాసిన పద్యాలు తెలుగువారికి సుపరిచితాలు వేమన సుమారు 1367 నుండి 1478 మధ్య కాలంలోజీవించాడు అని వేమన కడప జిల్లాకు చెందిన వారని ఆయన మరణం రెడ్డి శకం 1478 లో కటారుపల్లెలో ఈయన వృత్తి కవి సంస్కర్త అని అన్నారు. మరణించారని ఈ నాటికి వేమన ఏ కులానికి చెందినవాడు అనే దానిపై భిన్న అభిప్రాయాలు ఉన్నాయని, సీపీ బ్రౌన్ ద్వారా వేమన పద్యాలు 1839లో పుస్తకం రూపంలో తొలిసారిగా వెలుగులోకి వచ్చాయి. పామరులకు కూడా అర్ధమయ్యే భాషలో పద్యాలు చెప్పి ప్రజల్ని ముప్పించాడు. ఆట వెలదితో అద్భుతమైన కవిత్వం అనంతమైన విలువ గల సలహాలు సూచనలు విలువలు తెలుగు సంగతులు ఏమిటచ్చాడు అని కొనియాడారు. విశ్వదాబిరామ వినరా వేమ అనే మకుటంతో వేమన రాసిన పద్యాలు ఎంతో మందిని ఉత్తేజపరిచాయని అన్నారు. సామాన్యులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి ప్రజలను మెప్పించారన్నారు.

## విజేతగా నిలిచిన వెంగళరావు నగర్ టీమ్



**ఉదయగిరి, జనవరి 19, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని వెంగళరావు నగర్‌లో జరుగుతున్న ఎంకేఎస్ క్రికెట్ టోర్నమెంట్ ముత్యాలపాటి ఖాదర్ సాహెబ్ జ్ఞాపకార్థం కోసం వారి కుమారుడు అనీఫ్ ఆడించారు. ఆదివారం చివరి రోజు కావడంతో ఈటోర్నమెంట్‌లో 30 టీములు పాల్గొన్నాయి. అందులో వెంగళరావు నగర్ క్రికెట్ టీమ్ మొదటి బహుమతి రూ.30వేలు నగదు షీల్డ్ గెలుచుకున్నాయి. రెండో బహుమి ఉదయగిరి టీమ్ రూ.20వేలు నగదు షీల్డ్ గెల్చుకున్నారు. వీరిలో మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్ కూడా గెలుచుకున్నారు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్ కూడా గెలుచుకున్నారు. మూడో బహుమతి కూడా గెలుచుకున్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో పాల్గొనేందుకు చట్టు పక్కల పరిసర ప్రాంతాల నుంచి టీములు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆదివారం ఉత్కంఠంగా జరిగిన ఈ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో వెంగళరావు నగర్ టీం విజేతగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాలపాటి అబ్దుల్ ఖాదర్ అనీఫ్, షరీఫ్ అప్పల్, మాజీ సర్పంచ్ అబ్దుల్ ఖాదర్ మహమ్మద్ కాజా, షేక్ రియాజ్, అప్సర్, గ్రామపెద్దలు మహమ్మద్ కాజా గౌస్, మొహిద్దిన్, క్రీడాకారులు పాల్గొన్నారు.